# చీకటి నీడలు

కిటికీ దగ్గర నిలబడి ఇనుపచువ్వల మధ్యనించీ బయటికి చూస్తోంది అమృతం.

ఆమె చూపులన్నీ అతనిమీదే వున్నాయ్!

అతని ఎడమచేతిలో ఏదో పుస్తకంవుంది. కుడిచేత్తో అక్కడనేవున్న భూమిలో పాతిన ఇనుప కడ్డీని పట్టుకున్నాడు.

ఆ బస్సు షల్టర్‌కిందే అతనికి కొద్దిగా అవతలగా మరో ముగ్గురు మనుషులు కూడా నిలబడున్నారు. కానీ అమృతం దృష్టి వాళ్ళెవ్వరివేపూ ప్రసరించడం లేదు. వాళ్ళక్కడ నిల్చున్నారనే ధ్యాస కూడా ఆమెకు లేదు.

అతను అమృతం చూపుల్లో చిక్కుకు పోయాడు. ఆమె అతన్ని తన ఆలోచనల్తో బంధించి వేసింది. తనకి కొంచెం దూరంగావున్న ఆ ఇంటి కిటికీ వెనుకనించీ ఓ జత కన్నులు తననే చూసి పరవసించిపోతున్నాయని అతనికి తెలీదు. ఊహించలేడుకూడా!

అతన్నే చూస్తున్న అమృతం కనుల నిండుగా వెలుగుపూలు ఎన్నో వేల కాంతి నక్షత్రాలు...

మెల్లిమెల్లిగా చీకటి పడబోతోంది. రోడ్డు కిరువైపులా వున్న దీపా లన్నీ వెలిగాయ్. రోడ్డుమీద వుండివుండి కార్లు, రిక్షాలు దూసుకు వెళ్తున్నాయ్

ఇవేవీ అమృతానికి పట్టడం లేదు.

ఆమె కనులలో, ఆలోచనలతో అతనే నిండి వున్నాడు.



అతని చూస్తేచాలు తన గుండెలు ఆనందంతో స్పందిస్తాయ్. ఏదో తెలీని పరవశం, చెప్పలేని ఆనందం కలుగుతాయ్.

నాల్గు రోజుల్నించీ అతడ్ని తను చూస్తూనే వుంది. ఎన్నిసార్లు చూసినా ఇంకా చూడాలనే తపన...ఆరాటం. తీరని కోరిక....!

అతనంటే ఎందుకో తనకంత ఇష్టం? ఎన్నోసార్లు ప్రశ్నించుకుంది తనను తాను.

జవాబు లేదు.

అతనెవరో తనకి తెలీనుకూడా తెలీదు.

సరిగ్గా నాలుగురోజుల క్రితం ఓ రోజు సాయంత్రం చీకటి పడ డానికి ముందు మామూలుగా అలంకరించుకుని పువ్వులా ఇంటి బయట నిలబడింది తను.

అప్పుడే అతడ్ని మొదటిసారిగా చూసింది. రోడ్డు చివర్నించీ మెల్లిగా ఠీవీగా నడిచివస్తూ కనిపించాడు.

ఆ క్షణంలోనే తన గుండెలదిరాయ్. అవి అలా ఎందుకదిరాయో కూడా తనకి తెలీదు. అతడ్ని ఎక్కడో, ఎప్పుడో, ఏ జన్మలోనో కలుసు కున్న భావన!...

అతను దగ్గరవుతున్న కొద్దీ తన గుండెల అలజడి పెరగసాగింది.

తెల్లని పాంటు, తెల్లని షర్టు వేసుకుని మల్లెపువ్వులా వున్నాడతను!

కుడిచేతి వాచీ, విశాలమైన నుదురు, వత్తయిన జుట్టు, చిలిపి చూపులు అతని అందాన్ని మరింత విజృంభింప జేస్తున్నాయ్

అతని అందానికి చలించిపోతూ రెండడుగులు వెనక్కివేసింది తను.

సరిగ్గా అదే సమయానికి అతను ఇంటిముందు కొచ్చాడు.

తనని దాటివెళ్తూ ఒక్కసారి తల పైకెత్తి తనవంక చూశాడు.

వెంటనే తనకి ఏదో తెలీని సిగ్గు నిలువునా క్రమ్మేసింది... కలవరపడిపోయింది... తల వంచుకుంది...

అతను వెళ్ళిపోయాడు...

అతన్నే చూస్తూ అక్కడే నిలబడిపోయింది తను. ఒక్కసారి అతను వెనక్కి తిరిగి చూస్తే బావుండుననిపించింది తనకి. కానీ అతనలా చూడలేదు. రోడ్డు మలుపు తిరిగాడు.

అతను వెళ్ళిపోయినా అతని చూపులే తనని వెంటాడసాగాయ్! ఆ చూపుల కోసం తనేమైనా చేయగల్దు !

తనకా చూపులు కావాలి, అంతే!

అప్పట్నుంచీ రోజూ సాయంత్రం అదే వేళకి అతనటుగా వస్తూనే వున్నాడు. తనెక్కడున్నా సరే. ఆ సమయానికి బయటికొచ్చి అతనికి తెలీకుండా అతన్ని గమనిస్తూనే వుంది.

ఏదో ఆలోచిస్తూ వస్తూంటాడు.

సరిగ్గా ఇంటిముందుకు రాగానే ఓసారి తలెత్తి చూస్తాడు. అవే చూపులు! వాటిలో మార్పుండదు. ఆ చూపులని చూడగానే తనలో తత్తరపాటు ప్రారంభమవుతుంది. వెనక్కి పారిపోవా లనిపిస్తుంది. కానీ వెళ్ళలేదు. అతన్నే గమనిస్తూ అక్కడే నిలబడుతుంది.

అతను సరాసరి కొద్దిగా అవతలగా వున్న బస్టాప్ దగ్గరకెళ్ళి షెల్టరుక్రింద నిలబడతాడు. వెంటనే తను తలుపులేసి లోపలకెళ్ళి కిటికీ దగ్గర నిలబడుతుంది.

అక్కడ్నుంచీ చూస్తే అతను మరింత బాగా కనబడతాడు. అతనే కాదు - మరెవ్వరు కూడా తనని గమనించడానికి వీలుండదు. అందుకే అక్కడికి వెళ్ళి నిలబడుతుంది తను.

బస్సు రావడం ఆలస్యమయితే మొహంలో విసుగు కనబరుస్తూ, నిముష నిముషానికి వాచీ చూసుకుంటూ నిలబడతాడతను. అక్కడ నిలబడుతున్నంతసేపూ ఆ ఇనుపకడ్డీని కుడిచేత్తో పట్టుకునే వుంటాడు.

తను మాత్రం అతని బస్సు మరింత ఆలస్యంగా రావాలని కోరుకుంటూ కిటికీ దగ్గర నిలబడుతుంది. తను అలా అనుకోవడమే ఆలస్యం-బస్సు వచ్చేస్తుంది... అతను ఎక్కేస్తాడు!

నాల్గురోజుల్నించీ జరుగుతున్న తంతే ఇది!

ఇప్పుడూ అంతే... అతన్నే చూస్తూ బస్సు రావడం మరికొంత ఆలస్యమైతే బావుండునని అనుకోసాగింది.

అతనక్కడ ఇబ్బందిగా కదలసాగాడు. కడ్డీని వదలి కుడిచేతిని నడుముకి ఆన్చి ఒకవైపుకి కొద్దిగా ఒదిగి నిలబడ్డాడు.

జాలేసింది తనకి.

కానీ ఏంచేయగలదు ?

అందుకే అలా చూస్తూ నిలబడిపోయింది.

బస్సు షెల్టర్‌కు కొంచెం దూరంలో వున్న వీధి దీపం వెలుతురును విరజిమ్ముతోంది. ఆ వెలుతురులో అతని నీడ పొడుగ్గా సాగింది.

పాంటు జేబులోనించి సిగిరెట్టు పాకెట్ తీసి, ఓ సిగిరెట్టు వెల్గించాడు.

ఎంత అందంగా సిగిరెట్ కాలుస్తున్నాడు! తను చీకట్లో నిలుచున్నానన్న సంగతికూడా మరచిపోయి పరవశించిపోతూ అతన్నే చూడసాగింది అమృతం.

ఇంతలో బస్సు రావడంతో సిగిరెట్‌ని పారేసి గబగబా అటు కదిలాడు అతను.

కంటిముందున్న అందమైన కలని చెరిపేసినందుకు బస్సుమీద విపరీతమైన కోపం వచ్చింది అమృతంకి.

'వెధవబస్సు!' మనస్సులోనే తిట్టుకొంది.

బస్సు వెళ్ళిపోవడంతో నీరసంగా నిట్టూరుస్తూ వెనక్కి తిరిగింది. అప్పుడుగాని ఆమె గమనించలేదు, తనంతవరకూ చీకట్లోనే నుంచున్నా నన్న సంగతి!

దీపం వెలిగించింది. ఇంటినిండా వెలుతురు.

మళ్ళీ రేపు సాయంత్రంవరకూ అతను కనిపించడు. అమృతం మనసు దిగులుతో నిండిపోయింది.

బయట తలుపుమీద ఎవరో తడుతున్న శబ్దానికి అటు కదిలింది.

పాసింజరేమో! - ముఖాన పట్టిన చెమటని పైటతో తుడుచుకుని, జుట్టుని చేత్తోనే సవరించుకుని తలుపు తీసింది.

ఎదురుగా సామ్రాజ్యం!

"ఏంటి! పాసింజెర్లొచ్చే ఈ టైమ్‌లో తలుపులేసుకున్నావ్...? కొంపదీసి లోపల ఎవరూ లేరుకదా?" గారపట్టిన పళ్ళని బయటికిపెట్టి నవ్వుతూ అంది సామ్రాజ్యం.

సామ్రాజ్యం మాటలు వినగానే వళ్ళు మండిపోయింది అమృతానికి. బలవంతాన కోపాన్నణచుకుంటూ "వంట్లో బాగుండకపోతేను పడు కున్నాను..." అంది నెమ్మదిగా.

"వంట్లో బాగుండలేదని తొంగుంటే గడిచే జీవితాలా మనవి! బాగుండకపోతే పగలు పడుకోవాలి...అద్సరేగాని అతనెవరో వచ్చాడు రూముకంట వెళ్తావా?" అడిగింది సామ్రాజ్యం.

వెళ్ళనన్నట్లు తలూపింది అమృతం.

"ఇరవై ఇస్తారంట. అనవసరంగా వదులుకోవడమెందుకు? వెళ్ళు. ఇవాళ్టింత వరకూ నీకు బోణీ అయినట్టేలేదు. అందుకే నీ దగ్గరకి వచ్చాను." అమృతంపై విపరీతమైన జాలి వలకబోసింది.

"వెళ్ళను, స్టూడెంట్ కుర్రోళ్ళను నమ్మకూడదు. ముందు ఇద్దరమే నంటారు. తీరా వెళ్ళింతర్వాత పదిమందికిపైనే ఎగబడతారు." తన పాత జ్ఞాపకాన్ని నెమరువేసుకుంటూ నీరసంగా అంది అమృతం.

"సరే అయితే...కనకం వెళ్తుందేమో కనుక్కుంటాను. నేనివాళ మరోచోటికి వెళ్తున్నాను. లేకపోతే నేనే వెళ్ళేవాన్ని." గబగబా వెళ్ళిపోయింది సామ్రాజ్యం.

ఘోరున వర్షం కురిసి వెలిసినట్లనిపించింది అమృతానికి.

తలుపులను మూసి, దీపాన్ని తగ్గించి మంచంమీద వాలిపోయింది.

మళ్ళీ మనసులో అతను మెదిలాడు.

అతని చిలిపిచూపు గుర్తుకొచ్చింది.

వెంటనే అతని చుట్టూ ఆమె తన ఆలోచనలని అల్లుకోసాగింది.

మంగళవాద్యాలు మ్రోగుతున్నాయ్. రంగు రంగుల దీపాలతో వెలిగిపోతోంది కళ్యాణమంటపం.

పెళ్ళికూతురుగా తను...

తన పక్కనే పెళ్ళికొడుకుగా అతను!

తను సిగ్గుతో తలవంచుకూర్చుంది.

అతను లేచాడు.

ఎవరో తన జడను పైకెత్తి పట్టుకున్నారు. అతని చేతుల్లో మెరిసిన మంగళసూత్రం తన మెడ నలంకరించింది. మంగళవాద్యాల మోత పెరిగిపోయింది. అక్షింతల జల్లు...దీవెనలు...

అతనిప్పుడు తన భర్త!

ఇకముందు అతని ఇష్టాలే తన ఇష్టాలు, తన ఇష్టాలే అతని ఇష్టాలు! ఇద్దరూ చెరి సగం. ఇప్పుడా రెండు సగాలు కలిసి ఒకటయ్యాయి. తన జీవితానికి పరిపూర్ణత చేకూరింది.

పెళ్ళి తతంగాలన్నీ పూర్తయి ఇద్దరికీ పూర్తి ఏకాంతం దొరక డానికి దాదాపు వారంరోజులు పట్టింది.

ఇప్పుడిద్దరికీ కావలసినంత ఏకాంతం!

అతనాఫీసునించీ వచ్చేసరికి తను ట్రిమ్‌గా తయారై రెడీగా వుంది.

ఇద్దరూ ఒకే కప్పులోని కాఫీని సగం... సగం... తాగారు:

తను కప్పుకడిగి వచ్చేలోపు అతను రెడీ అయ్యాడు. ఇద్దరూ కలిసి బయటికి బయల్దేరారు కబుర్లు చెప్పుకుంటూ.

ఏ వీధిలో అయితే అతను పోతూంటే తను విపరీతమైన వ్యామో హంతో చూసేదో ఆ వీధిగుండానే అతన్తో కలిసి తను వెళ్తోందిప్పుడు! 'ఆ వీధిలో వాళ్ళెంతమంది తమని ఈర్ష్యగా చూస్తున్నారో!' తన మనసా నందంతో నిండిపోయింది.

ఇద్దరూ బస్టాప్‌లోని షెల్టర్ కిందకి చేరుకున్నారు. అలవాటుగా అతను కుడిచేత్తో ఇనుపకడ్డీని పట్టుకుని నిలబడ్డాడు.

అతనలా నిలబడితే తనింతకు ముందు దూరాన్నించీ చూసి ఆనందించేది. ఇప్పుడు తనతని పక్కనే నిలబడుంది. అతనిప్పుడెవరో కాదు - తన భర్త! అతన్లో అర్ధభాగం తను...

హఠాత్తుగా ఏదో గుర్తుకొచ్చి తనిదివరకు నిలబడి చూసే కిటికీ వేపు చూసింది.

ఆ చీకటిలో రెండు కళ్ళు తళుక్కున మెరిశాయ్!

ఎవరో తమని గమనిస్తున్నారు...

తమని కాదు అతన్ని...!

ఇక అక్కడ నిలబడలేక అతని చేయి పుచ్చుకుని గబగబా అక్కడ్నించీ బయల్దేరింది తను.

తను...తన ప్రక్కన అతను...

ఎక్కడెక్కడికో వెళ్ళిపోతున్నారు- పచ్చని చెట్ల మధ్యనించీ, తెల్లటి నీటి ప్రవాహాల పక్కనించీ.

నడుస్తూంటే ఇద్దరి భుజాలు రాసుకుంటున్నాయ్, అతను తనకేదో చెప్తున్నాడు. తను వింటోంది. మధ్య మధ్య తను నవ్వుతోంది. తను నవ్వినప్పుడల్లా అతను తన చేతివేళ్ళను మృదువుగా నొక్కుతున్నాడు.

పచ్చని చెట్లు...రకరకాల పువ్వులూ, పండ్లూ...చెప్పలేని వెలుతురు. రంగురంగుల పక్షులు...రివ్వునవీచే గాలి...పరుగులుతీసే సెలయేరూ దాటుకుంటూ ఓ చోట ఆగిపోయాడతను. తనూ ఆగింది.

ఎదురుగా నీటిఒడ్డున ఓ పొదరిల్లు. చుట్టూ ఎన్నో పూలచెట్లు. అదే తమ ఇల్లని చెప్పాడతను. తను మురిసిపోయింది.

ఇద్దరూ ఆ పొదరింటిముందు గుబురుగా వున్న చెట్లమధ్య కూర్చున్నారు.

తన ఒడిలో అతను...

అలా ఎంతోసేపు... కాలం తెలీదు. వెన్నెలొచ్చింది. చంద్రుడి కాంతిలో అతని కళ్ళు దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి. అతని కళ్ళల్లో కళ్ళుపెట్టి చూసింది.

అతని కళ్ళల్లో తన రూపమే!

కళ్ళలోనే కాదు-హృదయంలోకూడా తనరూపమే వుండివుంటుంది!

తన నడుంమీద చెయ్యివేసి ముందుకు లాక్కున్నాడతను. చటుక్కున అతనిమీద వాలిపోయింది తను!

అతని ముఖంమీద తన ముఖం!

సున్నితంగా తన పెదాలమీద ముద్దు పెట్టుకున్నాడు. తన వంట్లోకి విద్యుత్ ప్రవహించినట్టయింది. గుండెలో గంటలు మ్రోగాయి. వెంటనే అతను తన గుండెలో మరింతగా ఇమిడిపోయాడు. అతని చేతులు తనని పూర్తిగా చుట్టేశాయి. తనని తను మరచిపోసాగింది.

రకరకాల మధురమైన ఆలోచనల్తో అమృతానికి నిద్ర కరువైంది. అతని సరసన తనని వూహించుకుని, ఏయే లోకాల్లోనో విహరించసాగింది.

అమృతం దృష్టిలో అతను ఎంతో వున్నతుడు. మరో హిమాలయం. తనకి మరో జన్మంటూ వుంటే అతనే భర్తగా కావాలి...

—రాత్రి ఒంటిగంట కావస్తోంది. అయినా అతని ఆలోచనల్తో అమృతానికి నిద్రపట్టడం లేదు.

మంచం మీదనుంచి లేచింది.

తలుపు తీసుకుని బయటికి వచ్చింది.

రోడ్డు నిర్మానుష్యంగా వుంది. ఇళ్ళన్నీ నిద్రపోతున్నట్టున్నాయి. వాటికి కాపలా కాస్తున్నట్లుగా వెలుగుతోంది వీధి దీపం!

నెమ్మదిగా ఆమె బస్సు షెల్టర్ దగ్గరికి నడిచింది.

సరాసరి అతను నిలబడే చోటుకి వెళ్ళింది. అతను పట్టుకున్నట్టే కుడిచేత్తో ఇనుపకడ్డీని పట్టుకుని నిలబడింది.

ఆమె మనసునిండా అతనే నిండి వున్నాడు.

అతను రోజూ ఇదే కడ్డీని పట్టుకుని ఇక్కడే నిలబడతాడు. తనిప్పుడు అతను పట్టుకున్న కడ్డీనే అక్కడే పట్టుకుంది. అక్కడే నిల్చుంది.

రేపు అతనొస్తాడు. తను నిలబడ్డచోటనే ఇక్కడే నిలబడతాడు. ఈ కడ్డీనే తను పట్టుకున్నచోటనే పట్టుకుంటాడు.

అమృతానికి ఎంతో సంతోషమైంది. ఆ కడ్డీనలా పట్టుకుని ఎంత సేపలా నిల్చుండిపోయిందో ఆమెకే తెలీదు.

''ఏం, ఇంతవరకూ వచ్చిన బుకింగ్‌లు చాలలేదా-ఇంకా ఇక్కడ నిలబడున్నావ్...'' ఉలిక్కిపడింది అమృతం. ఎదురుగా బీట్ కానిస్టేబుల్! ఆమె గుండెల్లో రాయిపడింది.

''అబ్బే... ఏంలేదు...'' తత్తరపడింది.

''ఇవాళయినా నా మామూలిస్తావా?'' గద్దించాడు. ఆ మాటలతో ఆమె చలించిపోయింది.

తను తింటానికే లేనప్పుడు ఇతని కెక్కడ్నించి తెచ్చిస్తుంది?

అదే మాట అతన్తో అంది.

''సరిసరి... ఎప్పుడూ వుండేవేగా ఈ ఆకలి ఏడుపులు. పద... పద...'' అదిలించాడు.

ఆమె...

ఆమె వెనుకే అతనూ ఇంట్లోకి అడుగుపెట్టారు. తన ఆకలితోనే అతని ఆకలి తీర్చింది.

మేకల్ని తిన్న పులిలా గుడ్డల్ని సవరించుకుని వెళ్ళిపోయాడు బీట్ కానిస్టేబుల్. ఆ మంచంమీద స్పృహతప్పినట్లు పడున్న ఆమెకి ఎప్పుడు నిద్రపట్టిందోకూడా తెలీదు.

* * *

మామూలుగా మర్నాడు సాయంత్రమయేసరికి అలంకరించుకుని అతనికోసం యెదురుచూస్తూ నిలబడ్డది అమృతం. మెల్లగా వీస్తున్న గాలికి ఆమె తలలో సన్నజాజిపూలు బద్ధకంగా కదులుతున్నాయి.

అతనొచ్చే సమయమయింది.

ఆత్రంగా ఎదురుచూడసాగింది.

రెండురోజుల్నుంచీ అన్నం తినకపోవడంవల్ల కల్గిన నీరసాన్ని కూడా ఆ ఆత్రం పూర్తిగా తొక్కేసింది.

ఇప్పుడామె కవేవీ గుర్తులేవు.

అతను రావాలి. అతడ్ని చూడాలి. అదే ఆమెకు కావలసింది.

అటూ ఇటూ చూస్తున్న అమృతం చూపులు ఒకచోట నిలిచిపోయాయ్.

894.81331
RAM

అమృతం ప్రాణం విలవిల్లాడిపోయింది...

అతనెవరో బస్‌స్టాప్ షెల్టర్‌కింద నిలబడి కుడిచేత్తో కడ్డీని పట్టుకున్నాడు.

భరించలేకపోయింది. గబగబా తను వెళ్ళి అతని చేతిని లాగేద్దామనుకుంది.

ACC NO. 19324

ఇంతలో బస్సు వచ్చింది. అతడు ఎక్కాడు. హాయిగా గుండెల నిండా వూపిరి పీల్చుకుందామె!

20 200

చీకటిపడిపోయింది. ఇంకా ఇవాళ అతనెందుకు రాలేదూ? ఆత్రంగా అతనికోసం ఎదురు చూడసాగింది.

ఉన్నట్టుండి అమృతం పెదవులు విచ్చుకున్నాయ్. కళ్లు కాంతిని నింపుకున్నాయ్.

అతను మెల్లగా, ఠీవిగా వస్తున్నాడు.

ఆమె గుండెలు గుబగుబలాడాయి.

హృదయంలో పూలు పూశాయి.

ఆమెకు దగ్గరగా వచ్చాడతను.

మరుక్షణంలో అతను తనని దాటివెళ్ళిపోతాడు. ఇప్పుడే తను అతనిని చూడాలి...

తలెత్తింది ధైర్యంగా.

విస్తుబోయింది!

అతను సరాసరి బస్‌స్టాప్‌కేసి వెళ్ళలేదు. తనింటివేపు తిరిగాడు. ఓ క్షణం స్థంభించిపోయింది. అతని వుద్దేశాన్ని గ్రహించింది.

గబుక్కున లోపలకుపోయి భళ్లున తలుపులేసింది.

అమృతానికి నెత్తిన పిడుగులు పడుతున్నట్లుంది.

గబగబా కిటికీ దగ్గరకి వెళ్ళి నిలబడింది.

బస్‌స్టాప్‌లో అతన్లేడు అతనుండడని ఆమెకి తెలుసు. అయినా అటే చూస్తూ నిలుచుండిపోయింది. ఆమె కళ్ళ వెంట నీళ్లు ధారగా కారసాగాయి.

'నా దృష్టిలో మీరు అందరిలాంటి మనిషికాదు. అందరిలా మీరూ నీచమయిన కోరికలకి లొంగిపోయే నీచమయిన మనిషిలా నా దగ్గరికి రాకూడదు. నేను భరించలేను. నా గుండెల్లోవున్న మీ స్థానాన్ని చెరిపేయలేను!' భోరున ఏడుస్తూ మంచంమీద వాలిపోయింది.

ఠంగుమని వినబడ్డ శబ్దంతో లేచి నిలబడింది అమృతం.

కిటికీ దగ్గర కొచ్చింది.

ఎవరో కుర్రాడు వీధిలైటుని పగలగొట్టడాన్కి రాళ్లు విసురుతున్నాడు.

అతన్నాగమని గట్టిగా కేకేయాలనుకుంది. ఇంతలోనే అతను విసిరాడు మరోరాయి. ఆ బల్బుకి తగిలింది. అంతా చీకటి. చీకట్లోకి చూస్తూ నిలబడ్డ అమృత కళ్ళలో వెలుగులు లేవు. చీకటి నీడలు. *

(స్వాతి మాసపత్రిక సెప్టెంబర్ 79)